క్లుప్తంగా

5 వేల మందికి అన్నసమారాధన



తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): కాశీ అన్నపూర్ణ సమేత బాలకోటేశ్వర లింగాల స్వామి వారి దేవస్థానంలో కార్తిక మాసం అన్నసమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆలయ చైర్మన్ చెల్లు వెంకట రాజారావు, నాగమల్లేశ్వరి దంపతుల పర్యవేక్షణలో స్వామి వార్లకు విశేష పూజలు జరిపారు. స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. గడిచిన 12 ఏళ్లుగా ప్రతి ఏడాది కార్తికమాస ఉత్సవాలు జరపడం ఆనవాయితీగా వస్తోందని చైర్మన్ దంపతులు తెలిపారు. అనంతరం సుమారు 5 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

120 మందికి వైద్య పరీక్షలు

చాట్రాయి: మండలంలోని చనుబండ సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవ. పాల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ శ్రీ శర్వాణి కంటి ఆస్పత్రి వైద్యులు విశ్వనాథం సుమారు 120 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

మృతుల కుటుంబాలకు జోగి రమేష్ పరామర్శ



ఇబ్రహీంపట్నం: తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన వారి కుటుంబాలను వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ఆదివారం పరామర్శించారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణకు ఫ్లెక్సీలు కట్టే క్రమంలో ప్రమాదవశాత్తు మరణించిన మారిశెట్టి మణికంఠ, పామర్తి నాగేంద్ర, కాసకాని కృష్ణ, బొల్లా వీర్రాజు చిత్రపటాలకు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇదే ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కోమటి అనంతరావును పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సాయి నామ సంకీర్తన

తిరువూరు: స్థానిక సత్యసాయి సేవా సమితిలో ఆదివారం అఖండ సాయి నామ సంకీర్తన నిర్వహించారు. సత్యసాయిబాబా 99వ జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 23 వరకు ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆదివారం మహా నారాయణ సేవలో భాగంగా అన్నదానం చేశారు. 11న శివోపాసన, 12న హనుమాన్ చాలీసా పారాయణ తదితర కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

నూజివీడు: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీడు మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు డీవైఈఓ ఎం.సేవియా తెలిపారు. ఈ పరీక్షకు 10 పాఠశాలల నుంచి 113 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ప్రథమ స్థానాన్ని మీర్జాపురం హైస్కూల్‌కు చెందిన గరికపూడి త్రివేణి, ద్వితీయ స్థానాన్ని మీర్జాపురం హైస్కూల్‌కు చెందిన బెజవాడ హృషికేష్, నూజివీడులోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌కు చెందిన ఎస్.కవిత, ద్వితీయ స్థానాన్ని నూజివీడు ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌కు చెందిన ఎస్.నరసింహులు సాధించారని వివరించారు. విజేతలకు అభినందనలు తెలిపారు.

బహుమతుల ప్రదానం

తిరువూరు: బాలబాలికల్లో ఆధ్యాత్మిక భావన, సేవా దృక్పథం పెంపొందించేందుకు సత్యసాయి సేవా సంస్థలు నిర్వహించే బాలవికాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దామెర ప్రభాకరరావు అన్నారు. స్థానిక సేవా సమితి ఆవరణలో ఆదివారం సత్యసాయి సేవా సంస్థలు సాయిబాబా జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. పేదలు, అన్నార్తుల సేవకు ఏర్పాటైన సత్యసాయి సేవా సంస్థల ఆశయాన్ని ప్రజల్లోకి తీసుకెళతామన్నారు.

మామిడి మొక్కలు ధ్వంసం

ఆగిరిపల్లి: మండల పరిధిలోని అడవినెక్కలం గ్రామంలో కొందరు వ్యక్తులు మామిడితోటలోకి అక్రమంగా ప్రవేశించి మొక్కలను పీకివేశారని బాధిత రైతు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్తులతో కలిసి బాధిత రైతు మచ్చా హరిబాబు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సర్వేనంబర్ 43/2 లో 2.93 ఎకరాల వ్యవసాయ భూమి ఆక్రమించుకునేందుకు అనేక విధాలుగా వారు బెదిరించి, ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించి 100 మామిడి మొక్కలను పీకివేశారని, పొలం చుట్టూ ఉన్న రాళ్లను ధ్వంసం చేశారని చెప్పాడు. అధికారులు స్పందించి విచారణ జరిపి నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

నాణ్యతలేని ఇసుకతో సీసీ రోడ్ల నిర్మాణం

- బుడమేరు ఇసుకను వినియోగిస్తున్న కాంట్రాక్టర్లు
- గ్రామాల్లో భారీగా బుడమేరు ఇసుక డంప్‌లు
- బుడమేరు ఇసుకతో సీసీ రోడ్లు త్వరగా పాడైపోయే అవకాశం
- ఉచిత ఇసుక పేరుతో వాగులను గుల్ల చేస్తున్న వైనం



కవులూరు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి డంపు చేసిన బుడమేరు ఇసుక



కవులూరులో సీసీ రోడ్ల కోసం వెల్లటూరు గ్రామ శివారులోని బుడమేరులో ఇసుక తవ్వకాలు జరుపుతున్న కూలీలు

జి.కొండూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరయ్యాయి. సీసీ రోడ్ల ఏర్పాటుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. గ్రామ పంచాయతీలలో తీర్మానాలు చేసి అధికార పార్టీ నాయకులకు కాంట్రాక్టులు కట్టబెట్టారు. ఇక ఇక్కడే అసలు కథ మొదలైంది. సీసీ రోడ్లకు కృష్ణా నది ఇసుక వాడాల్సి ఉంది. నది ఇసుక కావాలంటే మూడు, నాలుగు రెట్లు అధికంగా ధర చెల్లించాల్సి ఉంది. దీనివలన రోడ్డు కాంట్రాక్టులో తాము అనుకున్న విధంగా డబ్బులు వెనకేసుకునే అవకాశం లేదని గ్రహించిన కాంట్రాక్టర్లు బుడమేరు ఇసుకపై కన్నేశారు. ప్రభుత్వ ఉచిత ఇసుక విధానాన్ని అడ్డు పెట్టుకొని సీసీ రోడ్ల పేరుతో వాగులను గుల్లచేసి గ్రామాలలో ఇసుకను డంప్ చేస్తున్నారు. మట్టి, రాళ్లు కలిసిన ఇసుకను సీసీ రోడ్లకు వినియోగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాణ్యత లేని బుడమేరు ఇసుక

బుడమేరుకు వరదలు వచ్చిన సమయంలో పరీవాహక ప్రాంతాల వ్యవసాయ భూముల నుంచి వరదకు కొట్టుకొచ్చిన మట్టి, రాళ్లు ఇసుకలో కలుస్తుంటాయి. దీని వలన బుడమేరు ఇసుక ఒక్కొక్క ప్రదేశంలో ఒక్కో రకంగా ఉంటోంది. ఒక చోట మట్టితో కలిసి తవుడులా మెత్తగా ఉంటే ఇంకో చోట రాళ్లతో కలిసి గండ్ర ఇసుకలా ఉంటుంది. నిబంధనల ప్రకారం సీసీ రోడ్ల నిర్మాణానికి నది ఇసుక వాడాల్సి ఉన్నప్పటికీ బుడమేరు ఇసుకను వాడడంపై అధికార పార్టీలోనే మరో వర్గం నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జి.కొండూరు మండల పరిధి కవులూరు గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కాంట్రాక్టరు వెల్లటూరు పరిధిలోని బుడమేరు నుంచి ఇసుకను తరలించి కవులూరు గ్రామంలో భారీగా డంపు చేశాడు. దీనిపై స్థానికులు నాణ్యతలేని ఇసుకతో సిమెంట్ రోడ్లు ఎలా వేస్తారంటూ పంచాయతీ రాజ్ ఏఈకి ఫిర్యాదు చేశారు.

90 శాతానికి పైగా వాగుల్లో ఇసుకతోనే..

మైలవరం నియోజకవర్గంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ. 22.50 కోట్లతో చేపట్టిన 209 సీసీ రోడ్ల ఏర్పాటులో 90 శాతానికి పైగా ఆయా గ్రామాల పరిధిలోని వాగుల్లో లభ్యమయ్యే ఇసుకనే వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం నది ఇసుకను వినియోగించాలి అంటే ఒక ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ. 4,500 వరకు ఖర్చు అవుతుంది. అదే బుడమేరు ఇసుక అయితే కేవలం లోడింగ్ చేసిన కూలీలకు రూ. 800, కిరాయికి రూ. 500 నుంచి రూ.వేయి వరకు ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో ట్రాక్టర్ ఇసుక బుడమేరు నుంచి తరలించి వినియోగించడం వలన రూ.2,500 వరకు మిగిలిపోతుంది. ఈ లెక్కన రూ. 10 లక్షలతో ఏర్పాటు చేసే రహదారికి 20 ట్రాక్టర్ల ఇసుక అంటే 84 టన్నుల ఇసుక వరకు వినియోగిస్తుంటారు. ఈ విధంగా రూ. 10 లక్షల రహదారికి రూ. 50 వేల నుంచి రూ. ఒక లక్ష వరకు ఇసుకకు ఖర్చు చేయాల్సిన నిధులు బుడమేరు ఇసుక వాడడం వల్ల కాంట్రాక్టర్ కి అదనంగా మిగిలిపోతోంది.

మైలవరం నియోజకవర్గంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల వివరాలు

మండలం	రోడ్లు	నిధులు
మైలవరం	50	రూ.5 కోట్లు
జి.కొండూరు	41	రూ.5 కోట్లు
రెడ్డిగూడెం	48	రూ.5 కోట్లు
ఇబ్రహీంపట్నం	57	రూ.5 కోట్లు
విజయవాడ రూరల్	13	రూ.2.50 కోట్లు

రోడ్లు పగిలిపోయే అవకాశం

బుడమేరుతో పాటు పలు వాగుల్లో ఇసుకను సీసీ రోడ్ల నిర్మాణానికి వినియోగించడం వలన అతి తక్కువ కాలంలోనే నెర్రెలుబారి రోడ్లు ధ్వంసమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే గతంలో నిర్మించిన పలు రహదారులు నెర్రెలు వారీ అస్తవ్యస్తంగా మారాయి. మరోసారి అలాంటి తప్పిదమే చేస్తే ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడటంతో పాటు ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి బుడమేరు ఇసుకను వినియోగిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యతలో రాజీపడేది లేదు

సీసీ రోడ్ల నిర్మాణంలో రాజీపడేది లేదు. నిబంధనల ప్రకారం నది ఇసుకనే వాడాలి. బుడమేరు ఇసుక నాణ్యత లేకపోతే వినియోగించేందుకు అనుమతించం. కవులూరు గ్రామంలో సీసీ రోడ్ల కోసం డంపు చేసిన ఇసుకలో నాణ్యత లేదని స్థానికుల నుంచి ఫిర్యాదు అందింది. ఇసుక డంప్‌లను పరిశీలించి నాణ్యత లేకపోతే నది ఇసుకనే వాడాలని ఆదేశిస్తాం.

– సాంబశివరావు, పంచాయతీరాజ్ ఏఈ, జి. కొండూరు మండలం

సంతోష్ అచ్యుత్‌కుమార్‌కు కాళోజీ కవితా పురస్కారం



ఇబ్రహీంపట్నం: ప్రముఖ ప్రజా కవి కాళోజీ కవితా పురస్కారాన్ని కొండపల్లికి చెందిన ప్రొఫెసర్ నేపా సంతోష్ అచ్యుత్‌కుమార్ అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్ రవీంద్ర భారతిలో భారత కల్చరల్ అకాడమీ, తెలుగు టెలివిజన్ రచయితల సంఘాలు సంయుక్తంగా నిర్వహించిన కాళోజీ నారాయణ జాతీయ స్మారక కవితల పోటీలు శనివారం రాత్రి జరిగాయి. కవితల పోటీల్లో సంతోష్ అచ్యుత కుమార్ 'పతాక వేదన' అనే కవితను వినిపించారు. ప్రేక్షకులను ఆలోచింపజేసిన ఈ కవితను అవార్డుకు ఎంపిక చేశారు. సంస్థ ప్రతినిధులు నాగబాల, సురేష్‌కుమార్, వెంకటస్వామి నాయుడు, ఆయనకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా పులువురు సంతోష్ అచ్యుతకుమార్‌కు అభినందనలు తెలిపారు.

ముగిసిన క్రీడా పోటీలు

మైలవరం: అప్సా ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో నిర్వహించే ఆటల పోటీలు వారి మధ్య సోదర భావాన్ని పెంపొందింపజేస్తాయని అప్సా డెమోక్రటిక్ వ్యవస్థాపకులు గొల్లపూడి మోహనరావు తెలిపారు. అప్సా డెమోక్రటిక్ మైలవరం నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల బాలబాలికల ఆటల పోటీలు ఆదివారం ముగిశాయి. స్థానిక గౌత మ్ స్కూల్, జూనియర్, సీనియర్లకు ఆటల పోటీలు ఎస్ఎస్‌కే స్కూల్‌లో జరిగాయి. ముగింపు కార్యక్రమంలో మోహనరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అప్సా ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

బెల్టు షాపుల దందా

- అధినేత చంద్రబాబు ఆదేశాలు బేఖాతరు
- టీడీపీ నేతలే బెల్ట్‌షాపుల నిర్వాహకులు
- నూజివీడు నియోజకవర్గంలో యథేచ్ఛగా నిర్వహణ
- పట్టించుకోని అధికారులు



చిన్నంపేటలో మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న టీడీపీ కార్యకర్త, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ కొరుకొండ ప్రసాద్‌ను అరెస్టు చేసిన ఎస్ఐ (ఫైల్)

నూజివీడు: బెల్టు షాపులు నిర్వహిస్తే రూ.5 లక్షలు జరిమానా విధించాలని ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతుంటే..మరోవైపు టీడీపీ కార్యకర్తలే బెల్టుషాపులు నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడుతున్నారు. నూజివీడు నియోజకవర్గం పరిధిలోని గ్రామాల్లో బెల్టుషాపుల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. నియోజకవర్గంలో 16 మద్యం షాపులు ఉండగా చాట్రాయి మండలంలో రెండు, నూజివీడు మండలంలో నాలుగు, ముసునూరు మండలంలో మూడు, పట్టణంలో మూడు, ఆగిరిపల్లి మండలంలో నాలుగు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. చాట్రాయి మండలం చిన్నంపేటలో టీడీపీ కార్యకర్త, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ కోరుకొండ ప్రసాద్ బెల్టు షాపును నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి 37 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్‌గా ఉన్న వ్యక్తి అందరికీ ఆదర్శంగా ఉండాల్సింది పోయి బెల్ట్ షాపులు నిర్వహిస్తుండటంపై ఆ మండల ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులు ఇప్పటి వరకు ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం, ముసునూరు మండలం బలివే, యల్లాపురం, నూజివీడు మండలం పల్లెర్లమూడి, అన్నవరం, పట్టణంలోని అజరయ్యపేటలలో బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. పెద్ద ఎత్తున బెల్టు షాపుల దందా కొనసాగుతోంది.

టీ కొట్టు, చిల్లర కొట్టుల్లోనూ మద్యం విక్రయాలు

పట్టణంలోని గొడుగువారిగూడెంలో 5 చోట్ల, ఎమ్మార్ అప్పారావు కాలనీలో 3 చోట్ల బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఎమ్మార్ అప్పారావు కాలనీలో టీ కొట్టులో, చిల్లర కొట్టుల్లో మద్యం విక్రయిస్తున్నారు. అమ్మేవారందరూ టీడీపీ కార్యకర్తలే. నియోజకవర్గంలో పలువురు బెల్టుషాపుల వారికి ఫోన్ చేసి ఆర్డర్ ఇస్తే ఇంటికి తీసుకెళ్లి ఇవ్వడం గమనార్హం. బెల్టుషాపుల్లో విక్రయించే మద్యంను ఒక్కొక్క సీసాకు ఎమ్మార్పీపై రూ.20కు అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

బెల్టుషాపులు నిర్వహిస్తుంటే చర్యలేవి?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక మనిషికి మూడు మద్యం సీసాల కంటే ఎక్కువ విక్రయించకూడదు. అయితే బెల్టుషాపుల్లో పదుల సంఖ్యలో మద్యం సీసాలు లభిస్తున్నాయి. ఆ మద్యం సీసాలు ఏ షాపు నుంచి సరఫరా అయ్యాయనేది ఎక్సైజ్ అధికారులకు స్పష్టంగా తెలుసు. అలాంటప్పుడు బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టంగా చెప్పినప్పుడు ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాపోరు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు



మాట్లాడుతున్న సీహెచ్ బాబురావు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాపోరు కార్యక్రమం చేపట్టామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు అన్నారు. సీపీఎం పట్టణ 8వ మహాసభ ఆదివారం కొండపల్లిలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాణ్యమైన మద్యం కంటే నాణ్యమైన బియ్యం, నిత్యావసరాలు ప్రజలకు అందించాలన్నారు. మత స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా వక్ఫ్ బోర్డులో మత చిచ్చు పెట్టేలా బీజేపీ ప్రజలను రెచ్చగొడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. నామినేటెడ్ పోస్టుల కంటే యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్టీటీపీఎస్, రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో ఖాళీ పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని ఎద్దేవా చేశారు. హామీలు విస్మరిస్తే ప్రజాగ్రహం తప్పదన్నారు. ప్రజాపోరు కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, వివిధ శాఖల కార్యదర్శులు ఆలేటి విఠల్ రావు, ఎం.మహేష్, వి.మురళీమోహన్, బేబీసరోజిని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

పిల్లలతో మాట్లాడే అవకాశం కల్పించాలని డిమాండ్

మైలవరం: తమ పిల్లలతో మాట్లాడే అవకాశం కల్పించాలని గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మైలవరం నారాయణ నగర్‌లోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న బాలికలు 260 మంది వరకు ఉన్నారు. గతంలో ప్రతి నెల రెండో ఆదివారం తల్లిదండ్రులు తమ పిల్లలను చూసుకునేందుకు అవకాశం కల్పించేవారు. ఈ నెల రెండో ఆదివారం కావడంతో కొంత మంది బాలికల తల్లిదండ్రులు తమ పిల్లలను చూసుకునేందుకు వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట దాటినా హాస్టల్ సిబ్బంది వారిని లోనికి అనుమతించకపోవడంతో గేటు వద్దే ఎండలో పడిగాపులు కాశారు. తమకు పిల్లలను చూసే అవకాశం కల్పించాలని నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి వచ్చి విద్యార్థుల తల్లిదండ్రులను లోనికి పిలిచి మాట్లాడారు. తమ పిల్లలను చూసుకునేందుకు ఎంతో దూరం నుంచి వచ్చామని, రెండు గంటల వరకు బయటే నిలబెడితే ఎలాగంటూ ప్రిన్సిపాల్‌ను వారు ప్రశ్నించారు. నెలకు ఒక్కసారైనా తమ పిల్లల్ని చూసుకునే అవకాశం కల్పించాలని కోరుతూ పలు సమస్యలను ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మిని వివరణ కోరగా విద్యార్థినులకు హాస్టల్‌లో భోజనం తిన్న తరువాతే తల్లిదండ్రులను అనుమతిస్తున్నామని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

సారాపై ఫిర్యాదు చేసినందుకు దాడి

నూజివీడు: పట్టణంలోని స్టేషన్ తోటలో ఇళ్ల మధ్య సారా విక్రయిస్తున్నారని పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం మధ్యాహ్నం ఫిర్యాదు చేసినందుకు బాల కోటయ్య, అతని కుమారుడిపై ఆదివారం ఉదయం దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. తమపైనే ఫిర్యాదు చేస్తారా అని ఎరికె రంగారావు, ఎరికె మణి, ఎరికె దుర్గ, ఉయ్యాల వెంకటేశ్వరమ్మ, ఆమె కుమారుడు కలిసి కర్రలతో దాడి చేసి కొట్టారు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ఇక్కట్లు

నూజివీడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ. రవి అన్నారు. నూజివీడు మండల సీపీఎం ఆరో మహాసభ ఆదివారం పాలేటి సుభాష్‌చంద్రబోస్ అధ్యక్షతన పల్లెర్లమూడిలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, కేంద్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. ఉచిత ఇసుక అందించే విధానం సక్రమంగా లేదని, విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేశారని, ప్రజలు చంద్రబాబు ప్రభుత్వానికి బుద్ధి చెప్తారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు, జిల్లా నాయకులు కె. శ్రీనివాస్, నూజివీడు పట్టణ కార్యదర్శి ఎస్ఆర్ హనుమాన్లు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పాలేటి సుభాష్ చంద్రబోస్, కమిటీ సభ్యులుగా సామ్యేలు, ఆర్. ప్రసాద్, చల్లారి శ్రీమన్నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉత్సాహంగా వన సమారాధనలు



కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని కొత్తూరు తాడేపల్లిలో ఈడా వేదాద్రి ఇంజినీర్స్ (ఈవీఈ) సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వన సమారాధన నిర్వహించారు. తొలుత వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంస్థ చైర్మన్ ఈడా వేదాద్రి దంపతులు శివలింగానికి క్షీరాభిషేకం చేశారు. 108 కలశాలతో గంగా పార్వతి సమేత శివునికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు నిర్వహించారు.

మైలవరం: మైలవరంలో కమ్మ మహాజన సహాయ సంఘం ఆధ్వర్యంలో కార్తిక మాస వనసమారాధన కార్యక్రమం ఆదివారం బంగారు వ్యాపారి బయన శ్రీనివాసరావు మామిడి తోటలో జరిగింది. సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. చిన్నారులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మహిళలకు నడక పోటీలు జరిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు



తిరువూరు: స్థానిక జగన్నాథపురంలో నిర్మాణంలో ఉన్న దాసాంజనేయస్వామి ఆలయానికి ఆదివారం పలువురు దాతలు విరాళాలు ఇచ్చారు. ఆర్యవైశ్య ప్రముఖులు గుడిమెట్ల లక్ష్మణరావు, లక్ష్మీరవీంద్ర బాబు, రమేష్ రూ.51,116, దారా మురళీకృష్ణ రూ.50,116, మైలవరపు నాగమణి, బ్రహ్మం రూ.50,116, నాళ్లా ఖాదర్‌బాబు రూ.21,116 విరాళాలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు, ట్రస్టు సభ్యులు కొల్లిప సుబ్బారావుకు అందజేశారు.

ఆర్ట్ ఆఫ్ ఏపీలో వెంకటాచారికి స్థానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆర్ట్ ఆఫ్ ఏపీ పుస్తకంలో కొండపల్లి బొమ్మలకు ప్రత్యేక స్థానం కల్పించారు. అత్యంత నైపుణ్యంతో కొండపల్లి బొమ్మలు తయారు చేస్తున్న హస్త కళాకారుడు కూరెళ్ల వెంకటాచారికి ఆర్ట్ ఆఫ్ ఏపీ పుస్తకంలో ప్రత్యేక కథనం లిఖించారు. విజయవాడ బెరం పార్క్‌లో ఆదివారం జరిగిన ఆర్ట్ ఆఫ్ ఏపీ పుస్తకావిష్కరణలో ఏటికొప్పాక హస్త కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీ రాజు చేతుల మీదుగా వెంకటాచారికి పుస్తకం అందజేసి సత్కరించారు. 300మంది హస్త కళాకారుల జీవిత విశేషాలు, హస్తకళలతో కూడిన ఆర్ట్ ఆఫ్ ఏపీలో వెంకటాచారి జీవిత విశేషాలు, బొమ్మల తయారీపై పుస్తకంలోని ఒపేజీలో పొందుపర్చారు.

నిత్యావసరాలు పంపిణీ



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరద ముంపునకు గురైన బాధితులకు గ్రేస్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. కేతనకొండ చర్చిలో జరిగిన కార్యక్రమంలో కేతనకొండ, చిలుకూరు, కాచవరం బాధితులు 300 మందికి సంస్థ డైరెక్టర్ మొగులూరి ఎలీషా, సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎలీషా మాట్లాడుతూ మానవతా దృక్పథంతో సరుకులు పంపిణీ చేశామని చెప్పారు. సంస్థ కార్యదర్శి సుమలత పాల్గొన్నారు.

నేడు 'మీకోసం'

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆర్డీఓ మొవిడి వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



మైలవరం: రెడ్డిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల 1987–92 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు కలుసుకుని ఉద్వేగానికి లోనయ్యారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూర్వ విద్యార్థులను అభినందించారు.

కళాకారులకు శిక్షణ

తిరువూరు: ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో తిరువూరులో ఆదివారం కళాకారులకు శిక్షణా తరగతులు ప్రారంభించారు. నాట్య మండలి జిల్లా కార్యదర్శి అప్పన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో జిల్లాలోని పలువురు కళాకారులు పాల్గొన్నారు. 2025 జనవరిలో తిరువూరులో సీపీఎం జిల్లా మహాసభలు జరుగనున్న నేపథ్యంలో కళాకారులకు శిక్షణ ఇస్తున్నామని వారు తెలిపారు.

10 మంది జూదరుల అరెస్టు

మైలవరం: మైలవరం మండలం చంద్రగూడెం మల్లయ్యకుంట చెరువు సమీపంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. 10 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.57,700 నగదును స్వాధీనం చేసుకున్నారు. మైలవరం ఏసీపీ వై. ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన దాడిలో మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్, ఎస్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ బాలలకు చేయూత

తిరువూరు: స్థానిక పరిపూర్ణ సేవా సంస్థలో అనాథ బాలలకు కార్తిక మాసంలో అన్నదానం చేయనున్నట్లు మునుకుళ్ల గ్రామ శైవ భక్తులు తెలిపారు. సేవా సంస్థలోని 30 మంది బాలలకు నెల రోజుల పాటు అన్నదానం చేసేందుకు శైవ భక్తులు ముందుకు వచ్చారని సంస్థ డైరెక్టర్ సిరికొండ నాగేశ్వరరావు చెప్పారు.